
సాక్షి ఒడిశా

మంగళవారం ၊ 20 ၊ ఫిబ్రవరి ၊ 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం సోమవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.5,19,476లు, బంగారం 12గ్రాములు 900 మిల్లీగ్రాములు, వెండి 70గ్రాములు 650 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



నేటి నుంచి మెట్రిక్ పరీక్షలు

రాష్ట్రంలో మెట్రిక్ పరీక్షలు నేటి నుంచి ప్రారంభమవుతున్నాయి.

- 8లో



చోరీకి గురైన విగ్రహాలు స్వాధీనం

కొద్దిరోజుల క్రితం పూరీలోని ఒక ఆలయంలో చోరీకి గురైన విలువైన విగ్రహాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

- 8లో

కొరాపుట్ .. పట్టం ఎవరికో..?

- లోక్‌సభ టిక్కెట్టు కోసం నేతల ప్రయత్నాలు
- అన్ని పార్టీల నుంచి ఆశావాహులు
- అధిష్టానాలను ప్రసన్నం చేసుకునేందుకు కసరత్తు




కౌసల్య హికక


అనసూయా మాఝి


సప్తగిరి ఉలక


అవినాస్ గొమాంగొ

రాయగడ:

త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా కొరాపుట్ లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేసేందుకు ప్రధాన పార్టీలకు చెందిన నాయకులు ప్రయత్నాలు మొదలుపెట్టారు. అధికార బీజేడీ తరుపున పోటీ చేసేందుకు ఒకవైపు కౌసల్య హికక ప్రయత్నిస్తుండగా, మరోవైపు ఎస్‌డీసీ చైర్‌పర్సన్(రాయగడ) అనసూయా మాఝి పేరు వినిపిస్తోంది. 2019లో జరిగిన లోక్‌సభ ఎన్నికలో కౌసల్య హికక ప్రధాన ప్రతిపక్ష పార్టీ కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన సప్తగిరి ఉలక చేతిలో 3,613 ఓట్ల తేడాతో పరాజయం పాలయ్యారు. దీంతో మరోసారి తనను తాను నిరూపించుకునేందుకు ఆమె ప్రయత్నిస్తున్నారు. అయితే ఈ స్థానం నుంచి పోటీ చేసేందుకు ఆసక్తి కనబరుస్తున్న అనసూయా మాఝి తనదైన శైలిలో పావులు కదుపుతున్నారు. మాజీ మంత్రి అనంతరాం మాఝి కుమార్తైన అనసూయా గతంలో డీసీసీ అధ్యక్షురాలిగా పనిచేశారు. అయితే కాంగ్రెస్ పార్టీకి అంతగా ఆదరణ లేకపోవడంతో బీజేడీ తీర్థం పుచ్చుకున్నారు. దీంతో ఇటీవల ఆమెను స్పెషల్ డవలప్‌మెంట్ కౌన్సిల్ (ఎస్‌డీసీ) సంస్థకు చైర్మన్‌గా ఆ పార్టీ అధిష్టానం నియమించింది. వరుసగా ఆమె వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటూ ప్రజలతో మమేకమవుతున్నారు. మొదట్లో రాయగడ శాసనసభ స్థానం నుంచి పోటీ చేసేందుకు ఆసక్తి కనబరిచిన మాఝి, ప్రస్తుతం లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేసేందుకు ప్రయత్నాలు కొనసాగిస్తున్నట్లు సమాచారం. ఇదిలాఉండగా కౌసల్య హికకకు కూడా రాజకీయాల్లో విశేష అనుభవం ఉంది. గత ఎన్నికలో ఈ స్థానం నుంచి ఓడిపోయినప్పటికీ, ఆమె పార్టీ కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. దీంతో బీజేడీ నుంచి కొరాపుట్ లోక్‌సభ స్థానం టిక్కెట్టు ఎవరికి దక్కుతుందోనని కేడర్ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

కాంగ్రెస్ నుంచి మరోసారి ఉలక

ఇదిలాఉండగా ప్రధాన ప్రతిపక్ష పార్టీ అయిన కాంగ్రెస్ నుంచి సిట్టింగ్ ఎంపీ సప్తగిరి ఉలక మరోసారి పోటీ చేసేందుకు తన అభ్యర్థిత్వ పత్రాన్ని ఆన్‌లైన్‌లో ఆ పార్టీ అధిష్టానానికి పంపించారు. కాగా ఇదే స్థానం నుంచి కాంగ్రెస్ నుంచి పోటీ చేసేందుకు డీసీసీ అధ్యక్షుడు బిజయ్ కుమార్ గొమాంగో తనయుడు, గుణుపూర్ సబ్ డివిజన్ యువజన కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు అవినాస్ గొమంగో సైతం తన అభ్యర్థిత్వ పత్రాన్ని అధిష్టానానికి పంపించారు. తన కొడుకు అవినాష్‌కు ఈసారి అవకాశం ఇవ్వాలని డీసీసీ అధ్యక్షుడు బిజయ్ గొమాంగో అధిష్టానానికి సిఫార్సు చేసినట్లు తెలుస్తోంది. అయితే ఎవరికి టిక్కెట్టు వచ్చినా పార్టీ విజయానికి అంతా కలిసికట్టుగా కృషి చేస్తామని చెబుతున్నారు. అలాగే మరో ఇద్దరు సైతం అధిష్టానానికి తమ పేర్లు పంపించినట్లు తెలుస్తోంది.


బసంత కుమార్ ఉలక


కాళీరాం మాఝి

బీజేపీ నుంచి ఇద్దరు

కొరాపుట్ లోక్‌సభ స్థానం నుంచి ఈసారి బీజేపీ నుంచి పోటీ చేసేందుకు ఆ పార్టీ రాష్ట్ర శాఖ ఎస్సీ, ఎస్టీ మోర్చ ఉపాధ్యక్షుడు కాళీరాం మాఝి ఆసక్తి చూపిస్తున్నారు. అలాగే రాయగడ అసెంబ్లీ స్థానం నుంచి 2019లో పోటీచేసి పారజయం పాలైన యువ నాయకుడు బసంత కుమార్ ఉలక సైతం ఈసారి కొరాపుట్ ఎంపీ స్థానం నుంచి పోటీ చేసేందుకు సన్నద్ధమవుతున్నట్లు పుకార్లు వినిపిస్తున్నాయి. అయితే రాష్ట్ర మాజీ మంత్రి జయరాం పంగి కూడా టిక్కెట్టు రేసులో ఉన్నట్లు వినికిడి. ఏదిఏమైప్పటికీ ఈసారి ఎన్నికలు రసవత్తరంగా మారనున్నాయని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

న్యూస్‌రీల్

రాయగడలో 'బుద్ధం శరణం గచ్ఛామి'


షూటింగ్‌లో పాల్గొన్న కళాకారులు

రాయగడ: పొరుగు రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌లోని ప్రస్తుత రాజకీయ పరిస్థితులు నేపథ్యంగా రాయగడలో షార్ట్ ఫిల్మ్ రూపొందిస్తున్నారు. స్థానిక కళాకారులు పిల్లల శంకరరావు, చిట్టూరు వెంకటరమణ, బాలకృష్ణ పట్నాయక్, కొండవలస కృష్ణమూర్తి పట్నాయక్, బలిజేపల్లి గౌరి శంకరరావు, డాక్టర్ బాబురావు మహంతి, కె.శివప్రసాద్, జ్యోతి, బి.అనిల్ కుమార్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి 'బుద్ధం శరణం గచ్ఛామి' టైటిల్‌గా పెట్టారు. ఈ షార్ట్ ఫిల్మ్‌కు గొట్టా సతీష్ కుమార్ దర్శకుడిగా వ్యవహరిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలకు ముందు యూ ట్యూబ్‌లో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలియజేశారు. ప్రసుతం చిత్రీకరణ పనులు ప్రారంభమయ్యాయని, రాయగడ పరిసర ప్రాంతంలో మరికొన్ని సన్నివేశ దృశ్యాలను చిత్రీకరించాల్సి ఉందని చెప్పారు.

క్యారీ బ్యాగుల పంపిణీ


క్యారీ బ్యాగులు పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

రాయగడ: కొరాపుట్ లోక్‌సభ స్థానం నుంచి కాంగ్రెస్ పార్టీ తరుపున మరోసారి పోటీ చేసేందుకు టిక్కెట్టు రేసులో ఉన్నటువంటి సిట్టింగ్ ఎంపీ సప్తగిరి ఉలక టిక్కెట్టు కోసం ప్రయత్నాలు కొనసాగిస్తూనే, మరోవైపు ఎలాగైనా తనకు టిక్కెట్టు వస్తుందనే నమ్మకంతో కార్యకలాపాలను కొనసాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆయన మద్దతుదారులు జేకేపూర్ ప్రధాన మార్కెట్‌లో సప్తగిరి ఫొటో ముద్రించి ఉన్న క్యారీ బ్యాగులను ప్రజలకు సోమవారం పంపిణీ చేశారు. ఈసారి కూడా సప్తగిరి ఉలకను గెలిపించాలని కోరుతూ సుమారు 500 మందికి అందజేశారు. కార్యక్రమంలో ఎస్.జీవితేశ్వరరావు, హరీష్ పులక, నంది గౌరి తదితరులు పాల్గొన్నారు.

స్వీడన్ దంపతులకు బాలుడు దత్తత


బాలుడుతో స్వీడన్ దంపతులు

కొరాపుట్: జిల్లా కేంద్రంలోని గొడగుడలో ఉన్నటువంటి ప్రత్యేక అనాథ శిశు సంరక్షణ కేంద్రం నుంచి రెండేళ్ల బాలుడిని స్వీడన్‌కు చెందిన క్లిఫోర్డు, థామస్ దంపతులు దత్తత తీసుకున్నారు. ఈ దంపతులకు ఇప్పటికే ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. అయితే వీరు తమకు దత్తత కోసం భారత ప్రభుత్వ నిబంధనలు మేరకు విజ్ఞప్తి చేసుకున్నారు. రెండేళ్ల అనంతరం ఆన్‌లైన్‌లో అనుమతి వచ్చింది. దీంతో కొరాపుట్ జిల్లా కలెక్టర్‌ను ఆదివారం కలిశారు. నిబంధనలు ఒప్పుకోవడంతో వారికి బాలుడిని సోమవారం అప్పగించారు. అనాథ ఆశ్రమ సిబ్బంది, సహచర అనాథ పిల్లలు బాలుడికి వీడ్కోలు పలికారు.

మత్తిలి చేరుకున్న సీపీఐ పాదయాత్ర


పాదయాత్రలో పాల్గొన్న సీపీఐ కార్యకర్తలు

మల్కన్‌గిరి: జిల్లాలోని చిత్రకొండ సమితి జాన్‌బాయి నుంచి సీపీఐ నేతలు చేపడుతున్న పాదయాత్ర మత్తిలి సమితి కేంద్రానికి సోమవారం చేరింది. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి అలీ కిషోర్ పట్నాయక్ ముందుగా సాహిద్ లక్ష్మణ్ నాయిక్ విగ్రహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గిరిజనుల కోసం లక్ష్మణ్ నాయక్ అనేక సేవలు అందించారని గుర్తు చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజనుల కోసం అమలు చేస్తున్న పథకాలు 80 శాతం ప్రజలకు చేరడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు గిరిజనులకు భూమి పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ మల్కన్‌గిరి జిల్లా కార్యదర్శి బ్రోజా మాఝి తదితరులు పాల్గొన్నారు.

దోషులను పట్టుకోవడంలో ప్రభుత్వం విఫలం



కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడించిన ఆదివాసీ మహా సంఘం నాయకులు

- ఆదివాసీ మహా సంఘం ఆందోళన

రాయగడ: జిల్లాలోని కాసీపూర్ సమితి లికిటిగుడ గ్రామానికి చెందిన లక్ష్మీ మాఝి అనే ఆదివాసీ యువతి హత్య కేసుకు సంబంధించి ఇంతవరకు దోషులను పట్టుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని జిల్లా ఆదివాసీ మహా సంఘం ఆరోపించింది. ఈ మేరకు ఆ సంఘం సభ్యులు, ఆదివాసీ నాయకులు పెద్ద సంఖ్యలో కలెక్టర్ కార్యాలయాన్ని సోమవారం ముట్టడించారు. స్థానిక సమితి కార్యాలయం నుంచి భారీ ర్యాలీ నిర్వహించి కలెక్టర్ కార్యాలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు అప్పల స్వామి కద్రక మాట్లాడుతూ జిల్లాలోని చంద్రపూర్‌లో ఉన్నటువంటి మా గృహంలో మేనేజర్‌గా పనిచేసిన లక్ష్మీ మాఝి అత్యంత దారుణంగా హత్యకు గురయ్యిందన్నారు. హత్య జరిగి రోజులు గడుస్తున్నా నిందితులను మాత్రం పోలీసులు పట్టుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. హత్య జరిగిన కొద్దిరోజుల తర్వాత జిల్లా పోలీసు యంత్రాంగం నామమాత్రపు దర్యాప్తు ప్రారంభించి చేతులు దులుపుకుందని ఆరోపించారు. అనంతరం ప్రభుత్వం స్పెషల్ బ్రాంచితో దర్యాప్తు చేసినా ఫలితం లేకపోయిందన్నారు. అందువలన సీబీఐతో హత్యకు సంబంధించిన దర్యాప్తు జరిపించాలని డిమాండ్ చేశారు. మరో రెండు వారాల్లో దోషులను పట్టుకోకపోతే ఆందోళన మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి


మాట్లాడుతున్న కార్మిక నేత ప్రమోద్ మహంతి


సమావేశంలో పాల్గొన్న కార్మికులు

జయపురం: బీజీపీపీఎల్, మదర్ అర్థ రిసోర్స్ కంపెనీల మధ్య జరిగిన ఒప్పందంలో కార్మికుల కోసం ఇచ్చిన హామీలను అమలు చేయాలని జయపురం గగణాపూర్ సేవా పేపరు మిల్లు కార్మిక నేత, బీఎస్‌పీఎం యూనియన్ అధ్యక్షుడు ప్రమోద్ కుమార్ మహంతి డిమాండ్ చేశారు. స్థానిక కార్మిక భవనంలో సేవా కార్మిక యూనియన్ల సాధారణ కార్యదర్శి సరోజ్ సువార్ అధ్యక్షతన సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మహంతి మాట్లాడుతూ ఉభయ కంపెనీల మధ్య జరిగిన 57 పేజీల ఒప్పందంలో శ్రామికుల కోసం ఇచ్చిన హామీలను అమలు చేయడంలో యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. నూతన వేతనం నిర్ణయ సమయంలో మిల్లు యాజమాన్యం, కార్మికులతో చర్చించాలని ఉన్నా, యాజమాన్యం పట్టించుకోవడం లేదన్నారు. ఆ ఒప్పందాన్ని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే పొందుపరిచిన మరికొన్ని సమస్యలను పరిష్కరించాలన్నారు. సమావేశంలో నాయకులు బనమాలి పాత్రో, సందీప్ పట్నాయక్, ధ్రువ మల్లిక్, ప్రమోద్ తివారీ, మురళీధర పాత్రో తదితరులు పాల్గొన్నారు.

సిమెంట్ ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా నిరసనలు


నిరసన తెలుపుతున్న గిరిజనులు

మల్కన్‌గిరి: జిల్లాలోని పోడియా సమితి పాత నిలిగూడ గ్రామం వద్ద సిమెంట్ ఫ్యాక్టరీ నిర్మాణానికి సోమవారం శంకుస్థాపన జరిగింది. దీంతో స్థానిక ప్రజలు ఫ్యాక్టరీని వ్యతిరేకిస్తూ ఆందోళన చేపట్టారు. ఫ్యాక్టరీ నిర్మాణం పూర్తయితే ఉస్కల్‌బాగ్, నందిగూడ, కతమాట్టేరు గ్రామాలు పూర్తిగా నాశనమవుతాయని ఆవేదన వ్యక్తం చేశారు. సాగు, తాగునీరు కలుషితమైతే గ్రామాలను విడిచి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకొని ఫ్యాక్టరీ నిర్మాణాన్ని ఆపాలని కోరారు.

బిసంకటక్‌లో గ్రీవెన్స్


యువ పారిశ్రామికవేత్తలకు చెక్కులు అందిస్తున్న కలెక్టర్ మహాజన్

రాయగడ: జిల్లాలోని బిసంకటక్ సమితి కార్యాలయం సమావేశ మందిరంలో కలెక్టర్ మనోజ్ సత్యబాన్ మహాజన్ ఆధ్వర్యంలో గ్రీవెన్స్ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. దీనిలో భాగంగా వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజల నుంచి 43 వినతులు స్వీకరించారు. వీటిలో 39 వ్యక్తిగతమైనవి కాగా, మరో 4 సామూహిక వినతులు ఉన్నట్లు వెల్లడించారు. అనంతరం ఒకరికి ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ.20 వేల ఆర్థిక సాయం అందజేశారు. మునిగుడ, బిసంకటక్, చంద్రపూర్ సమితుల్లో 26 మంది ఆదివాసీ యువ పారిశ్రామికవేత్తలకు ఆర్థిక సహకారం కింద రూ.లక్ష చొప్పున అందించారు. కొన్ని గ్రామాలకు చెందిన ప్రజలు ఆయా గ్రామాలకు మౌలిక వసతులు సమకూర్చాలని కోరారు. కార్యక్రమంలో ఎస్పీ హరీష్ బీసీ, గుణుపూర్ సబ్ కలెక్టర్ కిరణ్ దీప్ కౌర్, బిసంకటక్ బీడీవో సదాశివ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

నాలుగు వారాల్లో ఉన్నత స్థాయి కమిటీ



- రత్న భాండాగారంపై హైకోర్టుకు తెలిపిన ప్రభుత్వం

భువనేశ్వర్: పూరీ శ్రీజగన్నాథ ఆలయంలో రత్న భాండాగారం తెరిచేందుకు ఉన్నత స్థాయి కమిటీ ఏర్పాటు చేయనున్నట్లు హైకోర్టుకు రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. నాలుగు వారాల్లో ఈ కమిటీ అధ్యక్షుడిని నియమిస్తామని పేర్కొంది. 12వ శతాబ్దపు ప్రాచీన మందిరానికి చెందిన రత్న భాండాగారం తెరిచి దానిలో భద్రపరచిన సొత్తు గణన నిర్వహించాలని దాఖలైన పిటిషన్ విచారణ సందర్భంగా ప్రభుత్వం ఈ విషయాన్ని హైకోర్టుకు తెలియజేసింది. నాలుగు వారాల్లో కమిటీకి చైర్మన్‌గా సుప్రీంకోర్టు లేదా హైకోర్టు విశ్రాంత జడ్జిని నియమిస్తారు. నాలుగు వారాల తర్వాత ఈ కేసు తదుపరి విచారణ హైకోర్టులో జరగనుంది. శ్రీజగన్నాథ ఆలయ పాలక కమిటీ (ఎస్‌జేటీఎంసీ) ద్వారా అవసరమైతే రత్న భాండాగారం ఆభరణాల జాబితా తయారీని పర్యవేక్షించడానికి ఒక ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేయాలని హైకోర్టు గతంలో రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. న్యాయవాది పీతాంబర్ ఆచార్య తెలిపిన వివరాలు ప్రకారం 2023 సెప్టెంబర్‌లో రత్న భాండాగారం జాబితాను 2 నెలల్లోగా తయారు చేయడానికి ఒక ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేయాలని ఒడిశా ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. నిర్ణీత గడువులోగా కమిటీని ఏర్పాటు చేయడంలో ప్రభుత్వం విఫలమవ్వడంతో మరోసారి హైకోర్టును ఆశ్రయించినట్లు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, న్యాయశాఖ కార్యదర్శి, ఎస్‌జేటీఏ చీఫ్ అడ్మినిస్ట్రేటర్‌పై ధిక్కార పిటిషన్లు కూడా దాఖలు చేశామని ఆయన తెలిపారు. ఈ పిటిషన్‌ను విచారించిన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చక్రధారి శరణ్ సింగ్, న్యాయమూర్తి సావిత్రి రౌథొ ధర్మాసనం నాలుగు వారాల్లో కమిటీ అధ్యక్షుడిని నియమించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించిందన్నారు.

ఎమ్మెల్యేను హత్య చేస్తామని హెచ్చరిక



దుండగులు ఏర్పాటు చేసిన బ్యానర్


ఎమ్మెల్యే సంతోష్ సింగ్

భువనేశ్వర్: బొలంగీర్ జిల్లాలోని కంటాబంజి నియోజకవర్గం ఎమ్మెల్యేను హత్య చేస్తామని గుర్తు తెలియని దుండగులు హెచ్చరించారు. ఈ మేరకు కంటాబంజి బాలికల ఉన్నత పాఠశాల సమీపంలో ఒక దుకాణం వద్ద బ్యానర్ ఏర్పాటు చేశారు. 15 రోజుల్లోగా సిట్టింగ్ కాంగ్రెస్ ఎమ్మెల్యే సంతోష్ సింగ్ సలూజాను చంపేస్తామని అందులో రాశారు. దీంతో నియోజకవర్గంలో భయానక వాతావరణం నెలకొంది. బ్యానర్‌ను స్వాధీనం చేసుకున్న పోలీసులు, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మార్చి 1న రాష్ట్రపతి రాక

బరంపురం: మార్చి 1వ తేదీన నిర్వహించనున్న బరంపురం విశ్వ విద్యాలయం సమర్థన ఉత్సవాలకు ముఖ్య అతిథిగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము హాజరు కానున్నారు. ఈ మేరకు వర్సిటీ వీసీ ప్రొఫెసర్ గీతాంజలి దాస్ సోమవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. రాష్ట్రపతితో పాటు గవర్నర్ రఘుబర్ దాస్, సీఎం నవీన్ పట్నాయక్, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌లు పాల్గొనున్నట్లు వెల్లడించారు. ఉత్సవాల్లో భాగంగా విద్యార్థులకు పట్టాలు అందజేయనున్నారు.

కటక్‌లో నేరాల కట్టడికి చర్యలు



వాట్సాప్ నంబర్ విడుదల చేస్తున్న డీసీపీ కన్వర్ విశాల్ సింగ్

భువనేశ్వర్: రాష్ట్రంలోని మిలీనియం సిటీ కటక్‌లో గొలుసు దొంగతనాలు, వేధింపులు, బహిరంగంగా మద్యం సేవించడం, ఈవ్ టీజింగ్ వంటి వీధి నేరాల నివారణకు నగర కమిషరేట్ పోలీసులు నడుం బిగించారు. దీనికోసం 24/7 పనిచేసే హెల్ప్‌లైన్ నంబర్‌ను డీసీపీ డాక్టర్ కన్వర్ విశాల్ సింగ్ సోమవారం వెల్లడించారు. నగర ప్రజలకు వీధి నేరాలకు సంబంధించి ఏవైనా సమస్యలు ఉంటే 79788 94405 నంబర్‌కు వాట్సాప్ కాల్ చేయవచ్చు లేదా సాంఘిక మాధ్యమంలో సమాచారం అనుకూల రీతిలో చేరదీయవచ్చు. ఈ నంబర్ ప్రస్తుతం కార్యాచరణలో ఉన్న పోలీసు కంట్రోల్ రూమ్ నంబర్ 112తో అనుసంధానపరిచారు. హెల్ప్‌లైన్ మొబైల్ నంబర్ కాల్, వాట్సాప్ సందేశం నేరుగా కంట్రోల్ రూమ్‌లో స్వీకరించబడుతుంది. సమాచారకర్తను 15 నిమిషాల్లో సంప్రదించి 24 గంటల్లో ఫిర్యాదును పరిష్కరించడంతో పాటు సత్వర చర్యను నిర్ధారిస్తారు. కటక్ నగర అదనపు డీసీపీ అనిల్ మిశ్రా (క్రైమ్) నిత్యం హెల్ప్‌లైన్ మొబైల్ ఫోను సమాచారాన్ని సమీక్షిస్తారు. 24 గంటల్లో పరిష్కారం కాని ఏదైనా ఫిర్యాదు కోసం ఈ అధికారిని ప్రత్యక్షంగా సంప్రదించవచ్చు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు సహకరించవలసిందిగా నగర వాసులకు విజ్ఞప్తి చేశారు. 2021 సంవత్సరంలో భువనేశ్వర్ పౌరుల సౌలభ్యం కోసం ఈ వ్యవస్థని ప్రవేశపెట్టారు. విశ్వసనీయ సమాచారంతో వీధి నేరాలకు సంబంధించి సంప్రదించాలని తెలిపారు. సమాచారంతో అనుబంధ ఫోటో మరియు వీడియోలతో వీధి నేరాలను నివేదించడానికి వాట్సాప్ నంబర్ 70777 98111 జారీ చేశారు.

బాడీ బిల్డింగ్ పోటీలు ప్రారంభం



పోటీల్లో పాల్గొన్న బాడీ బిల్డర్లు



పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీ చంద్రశేఖర్ సాహు, ఎమ్మెల్యే విక్రమ్ పండా తదితరులు

బరంపురం: స్థానిక కల్లికోట్ వర్సిటీ క్రీడా మైదానంలో గంజాం జిల్లా బాడీ బిల్డింగ్ సంఘం ఆధ్వర్యంలో 20వ ఆల్ ఒడిశా రాష్ట్ర మెన్స్ అండ్ ఉమెన్స్ బాడీ బిల్డింగ్ పోటీలు సోమవారం ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిథులుగా హాజరైన బరంపురం ఎంపీ చంద్రశేఖర్ సాహు, ఎమ్మెల్యే విక్రమ్ పండా, బరంపురం అభివృద్ధి సంస్థ చైర్మన్ సుభాష్ మహరణలు జ్యోతి ప్రజ్వలన చేశారు. పోటీలకు రాష్ట్రంలోని 30 జిల్లాల నుంచి 80 మంది అభ్యర్థులు పాల్గొని ప్రతిభ కనబర్చారు. వీరిలో ఐదు మంది సెమీ ఫైనల్స్‌కు ఎంపికయ్యారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చిరతరంజన్ స్వాంయి, కార్యదర్శి ప్రసన్న మహేశ్వర్, కోశాధికారి తరిణి చటజీ, ఉపాధ్యక్షుడు బిశంబర్ బౌదర్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు పోలమాంబ ఐదవ జాతర

మక్కువ: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు శంబర పోలమాంబ అమ్మవారి ఐదవ జాతర మంగళవారం జరగనుంది. జాతరకు వచ్చిన భక్తుల సౌకర్యార్థం ఈవో వీవీ సూర్యనారాయణ పర్యవేక్షణలో ఏర్పాట్లు చేపట్టారు. భక్తులకు అవసరమైన లడ్డు, పులిహోర ప్రసాదాలను తయారు చేయించారు. జాతరకు వచ్చిన భక్తులు ఇబ్బందులు పడకుండా సీఐ జి.బాలకృష్ణ, ఎస్సై నరసింహమూర్తి ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించనున్నారు.

ఉరి వేసుకుని యువకుడి ఆత్మహత్య

భామిని: మండలంలోని దిమ్మిడిజోలకు చెందిన యవకుడు తాడేలు ఏకాశి(20) ఇంటిలో ఉరివేసుకుని సోమవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటనపై బత్తి ఏఎస్సై కె.కాంతారావు ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. తమ ఏకైక కుమారుడు ఏకాశి అనారోగ్య సమస్యలతో బాధపడుతూ తాము ఇంటిలో లేని సమయంలో ఉరివేసుకున్నాడని మృతుని తల్లిదండ్రులు తాడేలు అప్పన్న, అనసూయలు విలపిస్తున్నారు. ఏకాశి పదవ తరగతి ఫెయిలాయ్యక కొత్తూరులో బట్టల షాపులో పనిచేస్తున్నాడు, తల్లిదండ్రులు కాంక్రీట్ మిక్సర్‌తో రాజువారీ కూలి పనికి వెళ్లి వచ్చిన తరువాత ఇంట్లో కుమారుడు ఉరివేసుకుని ఉండడాన్ని చూసి గుండెలవిసేలా రోదించారు. మృతుడికి తల్లిదండ్రులతో పాటు ముగ్గురు అక్కాచెల్లెళ్లు ఉన్నారు.

గిరిజన రైతుకు ధరల 'చింత'



గిరిజన రైతుల నుంచి వ్యాపారులు కొనుగోలు చేసిన చింతపండు

కురుపాం: వ్యాపారుల సిండికేట్‌తో చింతపండుకు ధరలేక గిరిజన రైతులు దిగాలు పడుతున్నారు. గతేడాది కేజీ చింతపండు రూ.33 వరకు ధర పలికింది. ఈ ఏడాది రూ.23 నుంచి రూ.25కు మాత్రమే వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారని గిరిజన రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు ఎలక్ట్రానిక్ కాటాల మాయాజాలంతో యాభై కేజీల బస్తాకు 5 కేజీల నుంచి 8 కేజీల వరకు నష్టపోవాల్సి వస్తోందన్నారు. జీసీసీ అధికారులు స్పందించి ఇప్పటికే ప్రకటించిన మద్దతు ధర కిలో రూ.36కు చింతపండు మొత్తం కొనుగోలు చేయాలని కోరుతున్నారు.

ఇళ్ల పండగకు తరలిరండి

సాలూరు: పట్టణంలోని గుమడాం సమీపంలో నిర్మించిన 1056 టిడ్కో ఇళ్ల పంపిణీ పండగ మంగళవారం జరగనుందని, దీనికి పట్టణ ప్రజలందరూ హాజరుకావాలని ఉపముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమశాఖ మంత్రి పీడిక రాజన్నదొర పిలుపునిచ్చారు. స్థానిక విలేకరులతో ఆయన సోమవారం మాట్లాడారు. పేదవాడి సొంతింటి కల ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో సాధ్యమైందన్నారు. టిడ్కో ఇళ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయడం సంతోషంగా ఉందన్నారు. గత టీడీపీ ప్రభుత్వం ప్రతి లబ్ధిదారునిపై సుమారు రూ.7 లక్షలు భారం వేయాలని చూస్తే.. నేటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఒక్క రూపాయికే లబ్ధిదారు పేరున రిజిస్ట్రేషన్ చేసి ఇంటిని అప్పగిస్తోందన్నారు. ఈ బృహత్తర క్రతువులో అందరూ పాలుపంచుకోవాలని కోరారు.

పైడితల్లి ఆలయ అభివృద్ధికి కృషిచేస్తా



పైడితల్లి ఆలయ ఈఓగా బాధ్యతలు చేపడుతున్న డీవీవీ ప్రసాదరావు

విజయనగరం టౌన్: ప్రజాప్రతినిధులు, అధికారులు, భక్తుల సహకారంతో ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం పైడితల్లి అమ్మవారి ఆలయ అభివృద్ధికి కృషిచేస్తానని ఆలయ ఈఓ డీవీవీ ప్రసాదరావు తెలిపారు. ఈఓగా సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి దాతలు చేయూతనందించాలని కోరారు. ఆలయ సూపర్‌వైజర్లు ఏడుకొండలు, రమేష్ పట్నాయక్, మణికంఠ తదితరులు ఆయనకు అభినందనలు తెలిపారు.

24 నుంచి జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలు

కొత్తవలస: కొత్తవలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో ఈ నెల 24 నుంచి జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలను నిర్వహించనున్నట్టు శారద మెటల్స్ అండ్ ఎల్లాయీస్ లిమిటెడ్ కర్మాగార ప్రతినిధి జి.శంకరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒక్కో మండలం నుంచి ఒక్కజట్టు మాత్రమే పాల్గొనాలన్నారు. ఆసక్తిగల జట్లు ఈ నెల 20లోగా సెల్: 94935 49621, 94935 48330 నంబర్లను సంప్రదించి పేర్లు నమోదుచేసుకోవాలని కోరారు. విజేతలుగా నిలిచిన మొదటి నాలుగు జట్లకు వరుసగా రూ.లక్షా25వేలు, రూ. 60వేలు, రూ.30వేలు, రూ.25వేలు చొప్పున నగదు బహుతులు అందజేస్తామన్నారు.

చోరీకి గురైన విగ్రహాలు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న దేవుళ్ల విగ్రహాలు, ఆభరణాలు



వివరాలు వెల్లడిస్తున్న పినాక్ మిశ్రా

భువనేశ్వర్: కొద్దిరోజుల క్రితం ఒక ఆలయంలో చోరీకి గురైన విలువైన విగ్రహాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ చోరీ ఘటనలో ముగ్గురు నిందితులను పూరీలో అరెస్టు చేశారు. సోమవారం మీడియాతో పూరీ జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ పినాక్ మిశ్రా ఈ విషయం తెలిపారు. పట్టణంలోని తొలాబొణియా ప్రాంతం సర్వోదయ్ నగర్‌లోని ముక్తేశ్వర్ ఆలయంలో శివుడు, దేవి పార్వతి విగ్రహాలు, విలువైన రత్న భూషిత ఆభరణాలు చోరీకి గురయ్యాయన్నారు. పోలీసులు దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నగర డీఎస్పీ ఆధ్వర్యంలో పోలీసులు జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో దాడులు నిర్వహించి ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు. అరెస్టైన వారిలో ప్రధాన సూత్రధారి రంజన్ కుమార్ దాస్, అతని స్నేహితులు బికాష్ బెహెరా, సుశీల్ ప్రధాన్ ఉన్నారు. ఈ ముగ్గురు నేరం చేసినట్లు అంగీకరించారు. వారు విగ్రహాలను విక్రయించిన ఇద్దరు వ్యక్తుల వివరాలు తెలియజేశారు. దీంతో చోరీకి గురైన 2 విగ్రహాలు, ఆభరణాలను పోలీసులు స్వాధీనం చేసుకోవడంతో పాటు కొనుగోలు చేసిన ఇద్దరిని సైతం అరెస్టు చేశారు. అయితే ఇలాంటి నేరాలను అరికట్టేందుకు జిల్లాలోని ఆలయాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, సెక్యూరిటీ గార్డులను నియమించాలని పోలీసు సూపరింటెండెంట్ ఆలయ పాలక మండలి, కమిటీ సభ్యులకు విజ్ఞప్తి చేశారు.

బోడిగేటలో బీఎస్‌ఎఫ్ అవగాహన శిబిరం



బీఎస్‌ఎఫ్ జవాన్లతో గిరిజన యువకులు

మల్కన్‌గిరి: జిల్లాలోని కలిమెల సమితి బోడిగేట గ్రామంలో గిరిజన యువతకు అవగాహన శిబిరాన్ని బీఎస్‌ఎఫ్ జవాన్లు సోమవారం ఏర్పాటు చేశారు. చిత్రకొండ, కలిమెల పోడియా తదితర ప్రాంతాల్లో మరలా తమ ఉనికిని చాటుకోవడానికి మావోయిస్టులు ప్రయత్నం చేస్తున్నారు. దీంతో యువత వారి గ్రామాలను ఎలా రక్షించుకోవాలో సూచించారు. యువకులకు రానున్న రోజుల్లో ఉపాధి కల్పించడం కోసం ట్రైనింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో 142 బెటాలియన్ కామాండార్ కైలాస్ చంద్ర యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

25న ఉచిత క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు

విజయనగరం టౌన్: శ్రీ జైన్ శ్వేతాంబర్ తేరాపంత్ మహిళా మండలి జిల్లాశాఖ ఆధ్వర్యంలో ఈ నెల 25న జైన్ భవన్‌లో మహిళలకు బ్రెస్ట్, సర్వికల్ క్యాన్సర్‌కి సంబంధించిన స్క్రీనింగ్ టెస్ట్‌లను ఉచితంగా నిర్వహిస్తామని సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.సురానా, వినితా సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ టెస్ట్‌లను అంకాలజిస్టులు డాక్టర్ లీలా, డాక్టర్ ప్రియాంక నిర్వహిస్తారన్నారు. టెస్ట్‌లకు హాజరయ్యే మహిళలందరూ తమ ఆధార్‌కార్డులను తీసుకురావాలని కోరారు.

నేటి నుంచి 65వ ఉరుసు మహోత్సవాలు



ఉరుసు ఉత్సవాల వివరాలను వెల్లడిస్తున్న ఖలీల్‌బాబు



ఖాదర్‌వలీబాబా దివ్య క్షేత్రం

- బాబామెట్టలో మూడురోజుల పాటు వేడుక
- రాష్ట్ర, రాష్ట్రేతరప్రాంతాల నుంచి తరలిరానున్న భక్తులు
- ప్రతి ఒక్కరూ హాజరత్ ఖాదర్ బాబాను దర్శించాలి: ఖలీల్‌బాబు



హజరత్ ఖాదర్‌వలీబాబా

విజయనగరం టౌన్: విజయనగరం ఆధ్యాత్మిక చక్రవర్తి, హజరత్ సయ్యద్ షహీన్‌షా బాబా ఖాదర్ వలీ 65వ మహాసూఫీ సుగంధ మహోత్సవాలు మంగళవారం ప్రారంభం కానున్నట్లు ఖాదర్ బాబా దర్గా షరీఫ్ ముతవల్లి (ధర్మకర్త) డాక్టర్ ఎం.డి.ఖలీలులాల షరీఫ్ షా తాజ్ ఖాదరి (ఖలీల్ బాబు) పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన సోమవారం నిర్వహించిన సమావేశంలో ఉరుసు ఉత్సవాల వివరాలను వెల్లడించారు. విజయనగరంలోని ఆబాద్‌వీధిలో 1900వ సంవత్సరంలో జన్మించిన సూఫీ మహనీయుడు ఖాదర్‌బాబా తన 14 ఏళ్ల ప్రాయంలో హజరత్ బాబా తాజుద్దీన్ (నాగ్‌పూర్) వారి నుంచి అనుగ్రహం పొంది, వారి ఆజ్ఞానుసారం విజయనగరం బాబామెట్ట వేంచేశారన్నారు. నాటి నుంచి కఠోర తపస్సు ఒనర్చి, ప్రజలను అనుగ్రహించారని చెప్పారు. 1961లో తనువు చాలించి, సమాధి పొందారని, ఆ పవిత్ర పర్వదినాన్ని పురస్కరించుకుని బాబావారికి ఏటా గంధ మహోత్సవం ఘనంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. అందులో భాగంగా మంగళవారం ఉదయం 6 గంటలకు పవిత్ర ఖురాన్ షరీఫ్ పఠనంతో ఉరుసు మహోత్సవం ప్రారంభమవుతుందని చెప్పారు. అనంతరం జెండా మహోత్సవం, చాదర్ సమర్పణ ఉంటుందన్నారు. రెండోరోజు బుధవారం ఉదయం ఖురాన్ పఠనంతో పాటూ నషాన్, చాదర్, సందర్ షరీఫ్‌లతో ఫకీర్ మేళా ఖవాలీలతో దర్బార్ షరీఫ్ నుంచి ఖాదర్ బాబా వారి భారీ ఊరేగింపు జరుగుతుందన్నారు. మూడోరోజు గురువారం ఖురాన్ పఠనం, చాదర్ సమర్పణ, దస్తార్ బందీ, భక్తులకు తబురుక్ ప్రసాదాల పంపిణీ, సలామ్ ఖుల్ షరీఫ్‌తో ఉరుసు సమాప్తమవుతుందన్నారు. మూడురోజుల పాటు నిర్వహించే కార్యక్రమాలకు సూఫీ పీఠాధిపతి హజరత్ మహమ్మద్ అతావుల్లా షరీఫ్ షా తాజ్ ఖాదరీ బాబా ఆధ్యాత్మిక వారసుడు, సజ్జాద నషీన్ మహమ్మద్ ఖాజా మొహియుద్దీన్ షా ఖాదరి అనుదిన దివ్య సందేశం ఉంటుందన్నారు. భక్తులందరూ ఉత్సవాలకు హాజరై సహాయ, సహకారాలందించాలని కోరారు.

రాష్ట్రాల నుంచి తరలిరానున్న భక్తులు

ఉరుసు మహోత్సవాలకు ఆంధ్రప్రదేశ్‌లోని నలుమూలలతో పాటు దేశంలోని అనేక రాష్ట్రాల నుంచి ఖాదర్ బాబావారి భక్తులు అధిక సంఖ్యలో తరలిరానున్నట్లు ఖలీల్‌బాబు పేర్కొన్నారు. భక్తులకు అవసరమైన అన్ని రకాల వసతి సౌకర్యాలు ఏర్పాటుచేశామన్నారు. మూడురోజుల పాటూ మహా దివ్య అన్నసమారాధన ఘనంగా, నిర్విరామంగా కొనసాగిస్తామన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కుల అందజేత



ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను అందజేస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: నియోజకవర్గం పరిధిలోని 15 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి సోమవారం అందజేశారు. ఈ మేరకు కోలగట్ల స్వగృహంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్యమంత్రి సహాయ నిధి కింద మంజూరైన రూ.28లక్షల 64వేల చెక్కులను లబ్ధిదారులకు అందుకున్నారు. ఈ సందర్భంగా కోలగట్ల వీరభద్రస్వామి మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమన్నారు. ఆరోగ్యపరంగా ఇబ్బందులు ఎదుర్కొనే వారు, మృత్యువాత పడిన నిరుపేద కుటుంబాలకు అనేక రూపాల్లో ముఖ్యమంత్రి సహాయ నిధి కింద నిధులను మంజూరు చేస్తున్నారని తెలిపారు.

మార్చి 3న పల్స్‌పోలియో

పార్వతీపురంటౌన్: మార్చి 3న నిర్వహించనున్న పల్స్‌పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్వతీపురం మన్యం జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ బి.జగన్నాథరావు అన్నారు. ఈ మేరకు గిరిమిత్ర సమావేశ మందిరంలో వైద్యాధికారులు, ఆరోగ్య పర్యవేక్షకులకు సోమవారం పల్స్‌పోలియో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎస్ఎంఓ డాక్టర్ జాన్ జూట్ జోషువ పవర్ ప్రెజెంటేషన్ ద్వారా శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా జగన్నాథరావు మాట్లాడుతూ ఐదేళ్ల లోపు పిల్లలందరికీ మార్చి 3న జరగబోయే పల్స్‌పోలియో కార్యక్రమంలో పోలియో చుక్కలను వారి పరిధిలోనే వైద్య సిబ్బంది వేయనున్నట్లు తెలిపారు. జిల్లాలో మొత్తం 98వేల 991 మంది ఐదేళ్లలోపు పిల్లలకు 905 పోలియో బూత్‌లు కేంద్రాల్లో పోలియో చుక్కలు వేయనున్నామని, 41 మొబైల్ టీమ్స్ ఏర్పాటు చేసి బయట ఉన్న పిల్లలకు వేస్తారని, బస్టాండ్, రైల్వేస్టేషన్‌లలో కలుపుకుని 17ట్రాన్సిట్ కేంద్రాల్లో ప్రయాణాల్లో ఉండే పిల్లలకు పోలియో చుక్కలు వేయనున్నట్లు చెప్పారు. సంబంధిత శాఖల అధికారుల సమన్వయంతో మండల స్థాయి టాస్ ఫోర్స్ సమావేశం నిర్వహించి కార్యక్రమం విజయవంతమయ్యేందుకు అవసరమైన కార్యాచరణ చేయాలన్నారు.

డ్రాగా ముగిసిన రంజీ మ్యాచ్



72 పరుగులు చేసిన అశ్విన్ హెబ్బర్

విజయనగరం: రెండవ ఇన్నింగ్స్‌లో ఆంధ్ర బ్యాట్స్‌మన్ అశ్విన్ హెబ్బర్ 72 పరుగుల (165 బంతుల్లో 12 ఫోర్లు, 1 సిక్సర్)లో అద్భుత ఇన్నింగ్స్‌తో ఆతిథ్య ఆంధ్ర జట్టు ఓటమి నుంచి బయటపడి కేరళతో జరుగుతున్న రంజీ మ్యాచ్‌ను డ్రాగా ముగించింది. టెస్ట్ మ్యాచ్ తరహాలో నాలుగు రోజుల పాటు సాగిన మ్యాచ్‌లో చివరి రోజు సోమవారం 7 ఓవర్లలో వికెట్ నష్టానికి 19 పరుగుల ఓవర్ నైట్ స్కోరు వద్ద రెండవ ఇన్నింగ్స్ బ్యాటింగ్ ప్రారంభించిన ఆంధ్ర జట్టు మ్యాచ్ ముగిసే సమయానికి మొత్తం 97 ఓవర్లలో 9 వికెట్లు నష్టపోయి 189 పరుగులు జోడించింది. జట్టు బ్యాటింగ్‌లో కరన్ షిండే 26 పరుగులు, ఎస్‌కె రషీద్ 36 పరుగులు, అశ్విన్ హెబ్బర్ 72 పరుగులు, షోయబ్ మహమ్మద్‌ఖాన్ 11 పరుగులతో నాటౌట్‌గా నిలిచారు. బౌలింగ్‌లో కేరళ క్రీడాకారులు బిశాల్ 3 వికెట్లు, తంపీ 3 వికెట్లు, చంద్రన్ 2 వికెట్లు ఆక్కించుకున్నారు. అంతకు ముందు ఆంధ్ర జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 96.4 ఓవర్లలో 272 పరుగులు చేయగా.. కేరళ జట్టు 7 వికెట్ల నష్టానికి 514 పరుగుల వద్ద డిక్లేర్ ప్రకటించింది.

మద్యం సీసాలు స్వాధీనం



గజపతినగరం: మద్యం సీసాలను సీజ్ చేసి విలేకరులతో మాట్లాడుతున్న ఎస్సై మహేష్

పూసపాటిరేగ: మండలంలోని గోవిందపురంలో అనధికారంగా మద్యం సీసాలు విక్రయిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై ఎ.సన్యాసినాయుడు సోమవారం తెలిపారు. అనధికార బెల్టు షాపులో విక్రయానికి ఉంచిన 12 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. దాడిలో ఎస్సైతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

మధుపాడలో..

గజపతినగరం: మండలంలోని మదుపాడగ్రామానికి చెందిన ఎ.రాముపై మద్యం అక్రమ రవాణా కేసు నమోదు చేసినట్లు ఎస్సై యు.మహేష్ తెలిపారు. ఈ మేరకు సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ 33 మద్యం సీసాలను గజపతినగరం నుంచి తరలిస్తుండగా రామును అదుపులోకి తీసుకుని మద్యం సీసాలను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

నేటి నుంచి మెట్రిక్ పరీక్షలు



జయపురం: రాష్ట్రంలో మెట్రిక్ పరీక్షలు నేటి నుంచి ప్రారంభమవుతున్నాయి. కొరాపుట్ జిల్లాలోని 79 కేంద్రాల్లో 18,478 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నట్లు డీఈవో రామచంద్ర నాయక్ వెల్లడించారు. నోడల్ కేంద్రాల్లో ప్రశ్నాపత్రాలు ఉండడంతో ఆయా ప్రాంతాల్లో పటిష్ట భద్రత ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు. పరీక్షల్లో విద్యార్థులు మాస్ కాపీయింగ్‌కు పాల్పడకుండా సీసీ టీవీ నిఘా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలియజేశారు. పరీక్ష కేంద్రాల్లో పొరపాట్లు జరిగితే చర్యలు తప్పవని హెచ్చరించారు. పరీక్షలను పర్యవేక్షించేందుకు రెండు స్క్వాడ్‌లను నియమించినట్లు పేర్కొన్నారు.

రాయగడ: రాష్ట్రవ్యాప్తంగా జరగనున్న పదో తరగతి పరీక్షలకు రాయగడ జిల్లా నుంచి 12,115 మంది విద్యార్థులు హాజరవ్వనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి పూర్ణచంద్ర భోరియా తెలియజేశారు. జిల్లాలో 58 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని వెల్లడించారు. పరీక్షలు సజావుగా సాగేందుకు 11 మంది నోడల్ అధికారులను నియమించడంతో పాటు మరో 59మంది సూపరింటెండెంట్లను నియమించామని పేర్కొన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం



మృతదేహం వద్ద దర్యాప్తు చేపడుతున్న పోలీసులు

బరంపురం: నగరంలోని ఎంకేసీజీ ఆస్పత్రి హాస్టల్ క్యాంటీన్ ముందు నిర్మాణం జరుగుతున్న గదిలో గుర్తు తెలియని మృతదేహాన్ని స్థానికులు సోమవారం గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం రిపోర్టు వస్తే పూర్తి వివరాలు తెలిసే అవకాశం ఉందని ఐఐసీ కులమణి సెఠి పేర్కొన్నారు.

ఎమ్మెల్యే అనంతదాస్‌కు అస్వస్థత



చికిత్స పొందుతున్న ఎమ్మెల్యే అనంత దాస్

భువనేశ్వర్: బాలాసోర్ జిల్లా భొగొరాయ్ నియోజకవర్గం బిజూ జనతా దళ్ (బీజేడీ) ఎమ్మెల్యే అనంత దాస్ ఆదివారం రాత్రి అస్వస్థతకు గురయ్యారు. ఆయన శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది పడడంతో బాలాసోర్‌లోని ఫకీర్ మోహన్ మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్‌లోని ఐసియూలో చేర్చి వైద్య నిపుణులు చికిత్స చేస్తున్నారు. 83 ఏళ్ల అనంత దాస్ వృద్ధాప్య సంబంధిత వ్యాధుల కారణంగా గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆస్పత్రిలోని ఇద్దరు సీనియర్ వైద్య నిపుణుల పర్యవేక్షణలో చికిత్స కొనసాగుతోంది. ఆయన ఆరోగ్య పరిస్థితి క్రమంగా మెరుగుపడుతోందని జిల్లా ప్రధాన వైద్య అధికారి (సీడీఎంవో) దులాల్‌సేన్ జగత్‌దేవ్ మీడియాకు తెలిపారు. అయితే మెరుగైన చికిత్స కోసం దాస్‌ను భువనేశ్వర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

విజేతలకు సత్కారం



హాకీ జట్టుతో డీజీపీ, ఇతర పోలీసు ఉన్నతాధికారులు

భువనేశ్వర్: జమ్మూలో జరిగిన 72వ అఖిల భారత పోలీసు హాకీ ఛాంపియన్ షిప్-2024లో సత్తాచాటిన రాష్ట్ర జట్టును డీజీపీ అరుణ్ షడంగి సత్కరించారు. సోమవారం ఆయన కార్యాలయంలో ఏర్పాటు చేసిన నిరాడంబర కార్యక్రమంలో జాతీయ స్థాయి హాకీ పోటీల్లో కాంస్య పతకాన్ని గెలుచుకున్న జట్టు సభ్యులను అభినందించారు. ఈ స్ఫూర్తిని కొనసాగించి ఒడిశా పోలీసులకు కీర్తి ప్రతిష్ఠలు తీసుకురావాలని ఆకాంక్షించారు.

సీతారాముల కల్యాణం చూతము రా రండి



బోడికొండ వద్ద మృత్సంగ్రహణం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న అర్చకులు



రామతీర్థం దేవస్థానం

నెల్లిమర్ల రూరల్: భీష్మ ఏకాదశిని పురస్కరించుకుని రామతీర్థంలో సీతారామస్వామి తిరుక్కల్యాణ మహోత్సవం మంగళవారం రాత్రి కనుల పండువగా జరగనుంది. దీనికి దేవస్థానం అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. ఈ నెల 16న జరిగిన స్వామివారి పందిరిరాట మహోత్సవం నుంచే రామతీర్థానికి కల్యాణశోభ సంతరించుకుంది. నాలుగు రోజుల నుంచి రామక్షేత్రానికి భక్తుల తాకిడి పెరిగింది. సుదూర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి సీతారామచంద్ర ప్రభువులను, తూర్పు రాజగోపురం వద్ద వేసిన స్వామివారి పందిరరాటను దర్శించుకుంటున్నారు.

కనులారా తిలకిస్తే ఎంతటి భాగ్యమో....

వేకువజామునుంచే ఆలయంలో కల్యాణ మహోత్సవ పూజలు ప్రారంభం కానున్నాయి. మధ్యాహ్నం యాగశాలలో విశేష హోమాలు జరిపించిన తరువాత స్వామివారి సన్నిధిలో శ్రీమద్రామాయణ పారాయణం, వేదపఠనం నిర్వహించనున్నారు. పూసపాటిరేగ మండలం కుమిలి గ్రామానికి చెందిన ఏకుల వంశీయులు ఎప్పటిలాగే సీతమ్మవారి తరపున కల్యాణ వేడుకకు హాజరై స్వామివారికి పూజా ద్రవ్యాలను సమర్పించనున్నారు. పట్టు వస్త్రాలతో సీతారామస్వామివారిని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతారు. నాదస్వర కచేరి నిర్వహించిన తరువాత స్వామివారి ఉత్సవ విగ్రహాలను రామతీర్థం పురవీధుల్లో ఊరేగిస్తారు. ఈ ఊరేగింపులోనే సీతారాముల ఎదురు సన్నాహక మహోత్సవాన్ని నిర్వహిస్తారు. అనంతరం ఆ ఉత్సవ విగ్రహాలను కల్యాణ మండపంలోనికి తీసుకువచ్చి రాత్రి 9.30 గంటలకు అశేష భక్తజనం నడుమ స్వామివారి తిరుక్కల్యాణాన్ని వైభవోపేతంగా జరిపిస్తారు. అనంతరం 10 గంటలకు ఆరగింపు, మంగళాశాసనం జరిపిస్తారు.

వైభవంగా అంకురార్పణ

రామతీర్థంలో సీతారాముల వార్షిక కల్యాణాన్ని పురస్కరించుకొని సోమవారం అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం 6 గంటలకు విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, దీక్షధారణ తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా జరిపించారు. బోడికొండ వద్దకు ఊరేగింపుగా వెళ్లి పుట్టమట్టిని సేకరించారు. అనంతరం స్వామి కల్యాణానికి అంకురారోపణ చేపట్టి మంగళాశాసనం నిర్వహించారు.

సబ్ జూనియర్స్ కబడ్డీ పోటీలకు జిల్లా జట్లు సిద్ధం

- 21 నుంచి గుంటూరు జిల్లా సత్తెనపల్లిలో పోటీలు



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన సబ్ జూనియర్స్ బాల, బాలికల జట్లు

విజయనగరం: రాష్ట్రస్థాయిలో జరగనున్న సబ్ జూనియర్స్ బాల, బాలికల కబడ్డీ పోటీల్లో పాల్గొనే జిల్లా జట్లు సిద్ధమయ్యాయి. జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నగరంలోని సిటీ క్లబ్ ప్రాంగణంలో సోమవారం నిర్వహించిన ఎంపిక పోటీలకు జిల్లా నలుమూలల నుంచి 170 మంది క్రీడాకారులు హాజరుకాగా జిల్లా జట్టులో స్థానం సాధించేందుకు తీవ్ర స్థాయిలో పోటీపడ్డారు. ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగిన ఎంపిక పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 12 మంది క్రీడాకారులను బాలుర జట్టులోకి , 12 మంది బాలికల జట్టులోకి ఎంపిక చేశారు. జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు ఈనెల 21 నుంచి 23వ తేదీ గుంటూరు జిల్లా సత్తెనపల్లిలో జరగనున్న అంతర్ జిల్లాల సబ్ జూనియర్స్ కబడ్డీ పోటీల్లో విజయనగరం జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహిస్తారని జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎ.రంగారావుదొర, కార్యదర్శి కేవీ ప్రభావతిలు తెలిపారు. ఎంపిక పోటీలను జిల్లా అసోసియేషన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి నడిపేన లక్ష్మణరావు, వ్యాయామ ఉపాధ్యాయులు కె.గోపాల్, నడిపేన సూర్యనారాయణ, మీసాల శ్రీనివాసరావు, మజ్జి తిరుపతిరావు, సారిపల్లి గౌరీశంకరరావు, మజ్జి తిరుపతిరావు, బంటుపల్లి శివ, భాను తదితరులు పర్యవేక్షించారు.

క్లుప్తంగా

'సిద్ధార్థ్ రాయ్ చిత్రాన్ని ఆదరించండి'



మాట్లాడుతున్న దీపక్ సరోజ్

శ్రీకాకుళం అర్బన్: ఓ యువకుని జీవితంలో ప్రేమ, ఆ తర్వాత వచ్చే మార్పులతో జీవితంలో ఎలా ఎదిగాడనే చిత్రం సిద్ధార్థ్ రాయ్ అని ఆ సినిమా హీరో దీపక్ సరోజ్ అన్నారు. శ్రీకాకుళంలోని హోటల్ సన్‌రైజ్‌లో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో దీపక్ సరోజ్ మాట్లాడుతూ సిద్ధార్థ్ రాయ్ చిత్రాన్ని ప్రేక్షకాభిమానులు ఆదరించాలన్నారు. తన తల్లిదండ్రులది శ్రీకాకుళం జిల్లాయేనని, బాల నటునిగా 40కు పైగా చిత్రాలలో నటించానని చెప్పారు. వి.యశస్వి దర్శకత్వంలో విహాన్ విహాన్ క్రియేషన్‌లో తెరకెక్కిన సిద్ధార్థ్ రాయ్ చిత్రం ఈనెల 23వ తేదీన ప్రపంచ వ్యాప్తంగా విడుదల చేస్తున్నట్లు చెప్పారు. హీరోయిన్ తన్వీనేగి మాట్లాడుతూ ఎంతో కష్టపడి ఈ చిత్రాన్ని నిర్మించామని, ప్రేక్షకులు ఆదరించాలన్నారు. మరో హీరోయిన్ కీర్తన మాట్లాడుతూ ఈ చిత్రంలో తొలిసారిగా ఇద్దరు తెలుగమ్మాయిలు నటించినట్లు చెప్పారు. అందరూ మెచ్చే విధంగా, నేటి తరానికి దగ్గరగా ఈ చిత్రాన్ని దర్శకుడు తెరకెక్కించారన్నారు.

'పనుల నాణ్యతతోనే గుర్తింపు'



డైరెక్టర్ శ్రీనివాసమూర్తిని ఆదిత్యుని జ్ఞాపికను అందజేస్తున్న పాపారావు తదితరులు

అరసవల్లి: విద్యుత్ పంపిణీ సంస్థ తరఫున చేపడుతున్న పనుల్లో కాంట్రాక్టర్లు నాణ్యతకు ప్రాధాన్యమివ్వాలని, అప్పుడే కాంట్రాక్టర్‌కు తగిన గుర్తింపు వస్తుందని ఈపీడీసీఎల్ ఆపరేషన్స్ డైరెక్టర్ శ్రీనివాసమూర్తి సూచించారు. సోమవారం కార్పొరేట్ కార్యాలయంలో నూతనంగా బాధ్యతలను చేపట్టిన శ్రీనివాసమూర్తిని స్థానిక జిల్లా విద్యుత్ కాంట్రాక్టర్ల సంఘ అధ్యక్షులు ఉంగటి పాపారావు, ప్రతినిధులు గొద్దు చిరంజీవి, జరుగుళ్ల విశ్వనాధం తదితరులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డైరెక్టర్ శ్రీనివాసమూర్తి మాట్లాడుతూ నాణ్యమైన విద్యుత్‌ను అందించే లక్ష్యంతో తామంతా డిస్కం తరఫున పనిచేస్తున్నామని వివరించారు. అనంతరం స్థానిక జిల్లాలో విద్యుత్ పంపిణీ వివరాలను, కాంట్రాక్టర్ల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

'లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీ చేయాలి'



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా

శ్రీకాకుళం పాతబస్టాండ్: లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కరించి, పోలీస్ అధికారులు వారి పని భారాన్ని తగ్గించుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా అన్నారు. మార్చి 9వ తేదీన జరగబోయే జాతీయ లోక్ అదాలత్‌కు సంబంధించి జిల్లా కోర్టులోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో సోమవారం పోలీసులతో సమావేశం నిర్వహించారు. పోలీసులు రాజీ పడదగ్గ కేసులన్నిటినీ లోక్ అదాలత్‌లో పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లాలోని అదనపు జిల్లా న్యాయమూర్తులు శ్రీదేవి, మహేంద్ర ఫణి భూషణ్, భాస్కరరావు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఆర్.సన్యాసినాయుడు, అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి అనురాధ, అడిషనల్ ఎస్పీ ప్రేమ్ కాజల్ తదితరులు పాల్గొన్నారు.

'విజయం దిశగా పనిచేయాలి'

శ్రీకాకుళం అర్బన్: రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఉత్తేజంతో విజయం దిశగా పనిచేయాలని డీసీసీ అధ్యక్షుడు పేడాడ పరమేశ్వరరావు, కాంగ్రెస్ పార్టీ జిల్లా పరిశీలకులు మీసాల సుబ్బన్న, డోల శ్రీనివాస రావు, గుత్తుల శ్రీనివాసరావులు పిలుపునిచ్చారు. శ్రీకాకుళం పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమితులైన మీసాల సుబ్బన్నతో సహా అసెంబ్లీ నియోజకవర్గాల ఇన్‌చార్జులు డోల శ్రీనివాసరావు, గుత్తుల శ్రీనివాసరావులు సోమవారం శ్రీకాకుళంలోని ఇందిరా విజ్ఞాన్ భవన్‌లో జరిగిన సమీక్షలో పాల్గొని మాట్లాడారు. జిల్లాలో 30 మండలాలకు గాను పార్టీ మండల అధ్యక్షులను నియమించామని, 70 శాతం బూత్ స్థాయి అధికారుల నియామకం జరిగిందని, పంచాయతీ స్థాయి అధ్యక్షులు నియామకం ప్రస్తుతం జరుగుతుందని తెలిపారు.

పంచాయతీ ఈవో మృతి

మాకవరపాలెం (అనకాపల్లి జిల్లా): మాకవరపాలెం మేజర్ పంచాయతీ ఎగ్జిక్యూటివ్ అధికారి (ఈవో) సుదర్శనరావు మృతి చెందారు. శ్రీకాకుళం జిల్లాకు చెందిన ఆయన గత రెండేళ్లుగా ఇక్కడ ఈవోగా పనిచేస్తున్నారు. ఇటీవల ఆయనకు బ్రెయిన్ స్ట్రోక్ రావడంతో శ్రీకాకుళంలో శస్త్రచికిత్స చేశారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున ఆయన మరణించారు. ఆయన మృతికి పంచాయతీ పాలకవర్గ సభ్యులతోపాటు తోటి కార్యదర్శులు, మండల పరిషత్, సచివాలయ సిబ్బంది సంతాపం తెలియజేశారు.

కన్నుల పండుగ

కమ్మసిగడాంలోని మహాలక్ష్మి తల్లి జాతర రెండో రోజు కన్నుల పండువగా జరిగింది. ఉత్సవానికి శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాలకు చెందిన లక్షలాది మంది భక్తులు హాజరయ్యారు. అమ్మవారికి చీరలు, పసుపు-కుంకుమతో పాటు గాజులు సమర్పించి మొక్కులు చెల్లించారు.

- రణస్థలం



ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్లపై ప్రత్యేక దృష్టి

- కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలాని సమూన్

శ్రీకాకుళం పాతబస్టాండ్ : ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్లు వేగవంతం చేయాలని కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలాని సమూన్ సూచించారు. ఆయన సోమవారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జాయింట్ కలెక్టర్ ఎం. నవీన్‌తో కలిసి తహసీల్దార్లు, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు, నోడల్ అధికారులతో రెవెన్యూ, ఎన్నికలు, ఆరోగ్య శ్రీ, గ్రామ సచివాలయాలు, వార్డు సచివాలయాలపై ఆయన వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బందికి అవగాహన పరచి రిజిస్ట్రేషన్లు జరిగేలా చర్యలు తీసుకోవాలని డీఎల్‌డీఓను ఆదేశించారు. 4500 రిజిస్ట్రేషన్ కాలేదని మూడు రోజుల్లో పూర్తి చేయాలని పలాస ఆర్డీఓ డాక్టర్ భరత్ నాయక్‌ను కలెక్టర్ ఆదేశించారు. అత్యధికంగా అర్బన్ మండలాల్లో పెండింగ్‌లో ఉన్న రిజిస్ట్రేషన్లకు సంబంధించి ఎంపీడీఓలతో సమన్వయం చేసుకొని తక్షణమే పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. లే అవుట్ ల వారీగా లబ్దిదారుల జాబితా ఉంటుందని, జాబితా ద్వారా మొబలైజ్ చేయాలని శ్రీకాకుళం తహసీల్దార్‌ను ఆదేశించారు.



మాట్లాడుతున్న కలెక్టర్ మనజీర్ జిలాని సమూన్

జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ మాట్లాడుతూ నవరత్నాలు పేదలందరికీ ఇళ్ల రిజిస్ట్రేషన్లు 27,600 పూర్తయినట్లు చెప్పారు. 2167 డాక్యుమెంట్లు సరిగా లేవని తిరస్కరించినట్లు పేర్కొన్నారు. మండలాల వారీగా సమీక్షించి ఆయా గ్రామాల్లో కొత్తగా వచ్చేవి, తిరస్కరించినవి వివరించారు. కోర్టు కేసులు ఉన్నవి పక్కన పెట్టి మిగిలిన రిజిస్ట్రేషన్లు పూర్తి చేయాలని గార తహసీల్దార్‌కు చెప్పారు. రెవెన్యూ వెరిఫికేషన్‌కు సంబంధించి రీ సర్వేలో పెండింగ్‌లో ఉన్న రీ సర్వేను పూర్తి చేయాలని ఆదేశించారు. ఆరోగ్య శ్రీ యాప్ డౌన్ లోడ్, ఆరోగ్య శ్రీ హెల్త్ కార్డుల పంపిణీ పై మాట్లాడుతూ 5,71,691 కార్డులు జిల్లాకు చేరగా 4,45,725 పంపిణీ చేశారని డీఎంహెచ్‌ఓ డాక్టర్ మీనాక్షి వివరించారు. 1,25,966 కార్డులు పంపిణీ చేయాల్సి ఉందన్నారు. ఏపీ లాగ్ ఇన్ డౌన్ లోడ్ 2,47,791 కాగా 3,87,592 పెండింగ్‌లో ఉన్నట్లు చెప్పారు. 892 ఈకేవైసీ పూర్తి కాగా 24,855 ఈకేవైసీ పెండింగ్‌లో ఉన్నట్లు చెప్పారు. పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీలలో పెండింగ్‌లో ఉన్న 4700 కార్డులను తక్షణమే పంపిణీ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్ లో 9000 ఆరోగ్య శ్రీ కార్డులు పెండింగ్ లో ఉన్నాయని, రెండు రోజుల్లో పూర్తి చేస్తామని మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ తమీమా అన్సారియా కలెక్టర్‌కు వివరించారు. ఇచ్ఛాపురం మున్సిపాలిటీలో 2779 పెండింగ్‌లో ఉన్నాయని రెండు రోజుల్లో పూర్తి చేస్తామని కమిషనర్ చెప్పారు.

ఎన్నికలకు సంబంధించి పెండింగ్ లో ఫారం -6,7,8 లు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రత్యేక అధికారితో సమన్వయం చేసుకోవాలన్నారు. మండలాల వారీగా జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ సమీక్షించి పెండింగ్‌లో ఉన్న ఫారాలు తక్షణమే పూర్తి చేయాలని ఆదేశించారు.

లక్ష్మీ జ్యూయలర్స్‌లో భారీ దొంగతనం

- 44.5 కిలోల వెండి చోరీ
- అర్ధరాత్రి తర్వాత ఘటన

నరుబుజ్జిలి: మండల కేంద్రంలో ప్రధాన రహదారి పక్కనే గల లక్ష్మీ జ్యూయలర్స్‌లో ఆదివారం రాత్రి భారీ దొంగతనం జరిగింది. దుండగులు రివాల్వర్ తోపాటు, మాస్కులు ధరించి లోపలికి ప్రవేశించినట్లు పోలీసులు సీసీ ఫుటేజ్ పరిశీలించి తెలిపారు. ఈ చోరీలో 44కిలోల 500 గ్రాముల వెండి, రూ.10వేల నగదు పోయినట్లు షాపు యజమాని బొడ్డేపల్లి హరిబాబు పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు మేరకు ఆమదాలవలస సీఐ జి.దివాకర్‌యాదవ్, స్థానిక ఎస్ఐ బి.నిహార్ షాపు వద్దకు వచ్చి చోరీ జరిగిన ప్రాంతం, దొంగలు చొరబడిన షాపు వెనుకభాగం పరిశీలించారు. షాపు వెనుక భాగం నుంచి మాస్కులు, గ్లౌజులు ధరించి ఇద్దరు వ్యక్తులు లోపలికి జొరబడినట్లు సీసీ ఫుటేజ్‌లో కనిపించింది. ఘటన జరిగిన వెంటనే శ్రీకాకుళం నుంచి క్లూస్‌టీమ్‌ను రప్పించి వేలిముద్రలు సేకరించారు. శ్రీకాకుళం డీఎస్పీ వై.శృతి ఘటనా స్థలానికి వచ్చి వివరాలు సేకరించారు.



షాపును పరిశీలిస్తున్న డీఎస్పీ శృతి

రంగంలోకి డాగ్ స్క్వాడ్ బృందాలు

ఘటన జరిగిన వెంటనే పోలీసులు డాగ్ స్క్వాడ్‌ను రప్పించారు. ఈ జాగిలాలు లక్ష్మీ జ్యూయలర్స్ షాపు నుంచి వెనుకభాగంలో ఉన్న చర్చి మీదుగా నందికొండ కాలనీలో ప్రవేశించి వంశధార కుడి కాలువ ప్రాంతం వరకు వెళ్లి అక్కడి నుంచి వెనుదిరిగాయి. ఇంత పెద్ద దొంగతనం ఇప్పటివరకు ఇక్కడ జరగలేదని స్థానికులు చెబుతున్నారు.

గూడ్స్ రైలులో అగ్ని ప్రమాదం



పూండి వద్ద గూడ్స్ రైలులో మంటలను అదుపు చేస్తున్న ఫైర్ సిబ్బంది.

వజ్రపుకొత్తూరు:

మండలంలోని పూండి రైల్వే స్టేషన్‌లో ఆగి ఉన్న గూడ్స్ రైలులో అగ్ని ప్రమాదం సంభవించింది. ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత సంఘటన జరిగినట్లు సమాచారం. సకాలంలో పలాస అగ్ని మాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేయడంతో పెను ప్రమాదం తప్పింది. విశాఖపట్నం నుంచి పలాస వైపు వెళ్తున్న గూడ్స్ రైలు పూండి రైల్వే స్టేషన్‌లో ఆగి ఉండగా ప్రమాదం చోటు చేసుకుంది. రైలులోని బొగ్గుతో ఉన్న రెండు వ్యాగన్లలో మంటలు చెలరేగడంతో గమనించిన స్థానిక రైల్వే సిబ్బంది కాశీబుగ్గ అగ్ని మాపక కేంద్రానికి సమాచారం ఇచ్చారు. అగ్ని మాపక శకటంలో హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్న ఫైర్ సిబ్బంది మంటలు హై ఓల్టేజి విద్యుత్ లైన్‌లకు వ్యాపించకుండా సకాలంలో అదుపు చేశారు.

నేడు, రేపు వర్సిటీలో ఉద్యోగ ఇంటర్వ్యూలు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో మంగళ, బుధవారాల్లో హైదరాబాద్‌కు చెందిన కేఎంఈ కన్‌స్ట్రక్షన్స్ కంపెనీ ఆధ్వర్యంలో ఉద్యోగ ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బిడ్డిక అడ్డయ్య తెలిపారు. రిజిస్ట్రార్ కార్యాలయంలో సోమవారం వివరాలు వెల్లడించారు. అన్ని అఫిలియేషన్ కళాశాల నుంచి డిగ్రీ చివరి ఏడాది, డిగ్రీ పూర్తి చేసుకున్న 365 మంది విద్యార్థులు వర్సిటీ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. మంగళవారం బీఏ, బీకాం, బీబీఎం, బీబీఏ డిగ్రీ అర్హత వారికి, బుధవారం బీఎస్సీ వారికి ఇంటర్వ్యూలు ఉంటాయని చెప్పారు. ఎంపికైన వారు కంపెనీ నిబంధనల మేరకు దేశంలో ఎక్కడైనా పనిచేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఏడాదికి రూ. 2.04 లక్షలు ప్యాకేజీ, ఏడాది తర్వాత రూ.3.03 లక్షలు ప్యాకేజీ ఉంటుందని అన్నారు. స్క్రీనింగ్ రాత పరీక్ష, ఇంటర్వ్యూల ద్వారా ఎంపిక నిర్వహించనున్నట్లు తెలిపారు. వెబ్ సైట్‌లో నమోదు చేసుకున్న విద్యార్థులు ఉదయం 10 గంటల్లోపు చేరుకోవాల్సి ఉంటుందని పేర్కొన్నారు. రిజిస్ట్రార్ వెంట ప్లేస్‌మెంట్ అధికారి విద్యాసాగర్ ఉన్నారు.

మోసకారి చంద్రబాబును ప్రజలు నమ్మరు

- మంత్రి అప్పలరాజు, వైఎస్సార్‌సీపీ పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్‌చార్జి తిలక్

వజ్రపుకొత్తూరు రూరల్: అధికారం కోసం మోసపూరిత హామీలను గుప్పిస్తున్న చంద్రబాబును ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని రాష్ట్ర మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. పల్లిసారధి, చినవంక, గుళ్లలపాడు, డోకులపాడు, నగరంపల్లి గ్రామాల్లో సుమారు రూ. 5 కోట్లతో నిర్మించిన ప్రభుత్వ భవనాలను సోమవారం ప్రారంభించారు. గుళ్లలపాడు, నగరంపల్లిలో ఏర్పాటు చేసిన బహిరంగ సభల్లో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో పెత్తందారులకు, పేదలకు మధ్య యుద్ధం జరుగుతోందని అన్నారు. పేదల పక్షాన నిలిచే వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని గెలిపించేందుకు అంతా సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. గత ఎన్నికల్లో ఇంటికో ఉద్యోగం ఇస్తానని చెప్పి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు తర్వాత ఒక్క ఉద్యోగం ఇవ్వకపోగా తమ కొడుకు లోకేష్‌కు మాత్రం మంత్రి పదవి ఇచ్చుకున్నారని దుయ్యబట్టారు. రైతులకు, డ్వాక్రా మహిళలకు రుణమాఫీ చేస్తానని ఇచ్చిన హామీ గాలికి వదిలేశారన్నారు. ఎన్నికల ముందు మహిళలకు పసుపు కుంకుమతో పంగనామాలు పెట్టారని గుర్తు చేశారు. రెండు సార్లు ఎంపీగా ఉన్న రామ్మోహన్‌నాయుడుతో జిల్లాకు ఒరిగింది ఏమీ లేదన్నారు. జిల్లాకు చేసిన అభివృద్ధి ఏమిటో చెప్పాలని ప్రశ్నించారు. రూ. 45 కోట్లు ఎంపీ ల్యాడ్స్ నిధులతో కేవలం రైల్వే స్టేషన్‌లో స్టీల్ బెంచీలు వేయడానికే పరిమితం అయ్యారని దుయ్యబట్టారు. గౌతు శివాజీ చేతకానితనం వల్లే వంశధార శివారు ప్రాంతాలకు నీరు అందని పరిస్థితి దాపురించిందని విమర్శించారు. రైతులను మభ్యపెట్టేందుకు తండ్రి చేసిన పాపాలను కప్పిపుచ్చుతూ శిరీష డ్రామాలు ఆడుతున్నారని, అవగాహన లేక పిచ్చి ప్రేలాపన చేస్తున్నారని అన్నారు. 60 ఏళ్లు పాలించిన గౌతు కుటుంబ పాలనలో ఉద్దాన ప్రాంతంలో జరిగిన అభివృద్ధిపై చరిత్రలో ఓ పేజీ అయినా ఉందా అంటూ ప్రశ్నించారు. పశువుల్లా ప్రవర్తిస్తున్న టీడీపీ నాయకులకు వైద్యం చేయడానికి డాక్టర్‌నైన తనకు జగన్ మోహన్ రెడ్డి పశువుల శాఖను ఇచ్చారని అన్నారు. సాగునీరు అందించేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని టెక్కలి మదనగోపాల సాగరం వద్ద బైపాస్ కాలువ నిర్మించి రైతులకు సాగు నీరు అందిస్తామని అన్నారు. వైఎస్సార్ సీపీ పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త పేరాడ తిలక్ మాట్లాడుతూ జగన్ మోహన్ రెడ్డి సామాజిక విప్లవాన్ని తీసుకువచ్చారని అన్నారు. టీడీపీకి అధికారం ఇస్తే ప్రజలు జన్మభూమి కమిటీల చుట్టూ తిరగాలని, అదే వైఎస్సార్ సీపీ అధికారంలోకి వస్తే ప్రజల చుట్టూ వలంటీర్లు తిరుగుతూ సంక్షేమ పథకాలు అందిస్తారని అన్నారు. ప్రజలు మోసకారి చంద్రబాబును నమ్మవద్దని అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఉప్పరపల్లి నీలవేణి, వైఎస్సార్ సీపీ సాంస్కృతిక విభాగం జిల్లా అధ్యక్షులు ఉప్పరపల్లి ఉదయ్‌కుమార్, వైఎస్సార్ సీపీ ప్రధాన కార్యదర్శి పాలిన శ్రీనివాసరావు, ఏఎంసీ చైర్మన్ పీవీ సతీష్, పీఏసీఎస్ అధ్యక్షుడు దువ్వాడ మధుకేశ్వరరావు, సర్పంచ్‌లు బత్తిని కుసుమ, వడ్డి సరిత, దువ్వాడ పద్మావతి, కొల్లి భాస్కరరావు, నర్తు లక్ష్మినారాయణ, కర్రి శ్రీను, ఎంపీటీసీలు బమ్మిడి రాజ్యలక్ష్మి, కొయిరి భాగ్యలక్ష్మి, వైఎస్సార్ సీపీ నాయకులు బత్తిని హేమంత్, పోతనపల్లి ధర్మారావు, వడ్డి కరుణకర్, కొయిరి ఢిల్లీరావు, బగాది శ్రీకాంత్, రెయ్యి శ్రీను, గణేష్, బమ్మిడి మోహన్‌రావు, ఇరోతు హేమంత్, తదితరులు ఉన్నారు.



సభలో మాట్లాడుతున్న రాష్ట్ర మంత్రి సీదిరి అప్పలరాజు, వైఎస్సార్ సీపీ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్

'అభివృద్ధి చేసి చూపించాం'

శ్రీకాకుళం రూరల్: స్వాతంత్య్రం వచ్చినప్పటి నుంచి జరగని అభివృద్ధి ఈ ప్రభుత్వ హయాంలో జరిగిందని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. మండల పరిధిలోని పాత్రునివలస గ్రామంలో రూ.62 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రాలను మంత్రి ధర్మాన సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ భవిష్యత్ తరాలు బాగుండాలంటే మళ్లీ ఈ ప్రభుత్వానికే పట్టం కట్టాలన్నారు. విపక్ష నేత చంద్రబాబు మాటలకు నిలకడ ఉండదని విమర్శించారు. రెండేళ్ల ముందు ముఖ్యమంత్రి జగన్ ప్రజాధనం దుర్వినియోగం చేస్తున్నారని విమర్శించిన చంద్రబాబు ఇప్పుడు అంతకంటే ఎక్కువ ఇస్తామనడం విడ్డూరమన్నారు. జిల్లాకు చంద్రబాబు ఒక్క మంచి పనైనా చేయలేదని గుర్తు చేశారు. కార్యక్రమంలో జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు అంబటి శ్రీనివాసరావు, ఎంపీపీ అంబటి నిర్మలా, జెడ్పీటీసీ రుప్ప దివ్య, మండల పార్టీ అధ్యక్షుడు చిట్టి జనార్దన రావు, ఏఎంసీ చైర్మన్ మూకళ్ల తాతబాబు, పార్టీ నాయకులు బాణాల గాంధీ, కొయ్యాన రాంబాబు, పల్లె వైకుంఠం, రావాడ రాము, కొయ్యాన రామచంద్రరావు, తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

మహిళా డిగ్రీ కళాశాల 1,3 సెమిస్టర్ల ఫలితాలు వెల్లడి

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా డిగ్రీ (అటానమస్) కళాశాలలో 2023–24 విద్యా సంవత్సరానికి చెందిన 1, 3 సెమిస్టర్ ఫలితాలు విడుదలయ్యాయి. ఈ ఫలితాలను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కింతలి సూర్యచంద్రరావు విడుదల చేశారు. సకాలంలో ఫలితాలు విడుదల చేయడంలో కీలకంగా వ్యవహరించిన కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్‌ను, సిబ్బందిని అభినందించారు. 1వ సెమిస్టర్‌లో బీఏ గ్రూపు విద్యార్థులు 53.33 శాతం, బీఎస్సీ గ్రూపు 84.49 శాతం, బీకాం (జనరల్) 63.56% శాతం ఉత్తీర్ణతను సాధించారు. మొత్తం మీద మొదటి సెమిస్టర్‌లో కళాశాల విద్యార్థులు 72.22 శాతం ఉత్తీర్ణతను సాధించారు. 3వ సెమిస్టర్‌లో బీఏ గ్రూపు విద్యార్థులు 23.88 శాతం, బీఎస్సీ గ్రూపు 56.20 శాతం, బీకాం (జెనరల్) 65.12శాతం, బీకాం (వొకేషనల్)76.92 శాతం ఉత్తీర్ణతను సాధించారు. మొత్తం మీద మూడో సెమిస్టర్‌లో కళాశాల విద్యార్థులు 54.52 శాతం ఉత్తీర్ణతను సాధించారని కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ టి.ఆదిలక్ష్మి వెల్లడించారు.



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ సూర్యచంద్రరావు, పక్కనే శంకర్‌నారాయణ, కృష్ణారావు

21న 'స్కిల్ క్వెస్ట్'

- శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో నిర్వహణ
- 50 స్టాళ్ల ఏర్పాటుకు సన్నాహాలు

శ్రీకాకుళం న్యూకాలనీ: విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికి తీసేందుకు శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల నడుం బిగించింది. ఈ నెల 21వ తేదీన 'స్కిల్ క్వెస్ట్' కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించేలా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సురేఖ ఏర్పాట్లు చేస్తున్నారు. విద్యార్థుల్లో వినూత్న ఆలోచనలు, వ్యవస్థాపక దృక్పథంతో ముందుకు రావడానికి విద్యార్థులను ప్రేరేపించడం స్కిల్ క్వెస్ట్ కార్యక్రమం ప్రధాన లక్ష్యంగా భావిస్తున్నారు. ఆహారం, పానీయాలు, కళలు, చేతిపనులు, మరమ్మతులు, సరదా ఆటలు, డయాగ్నస్టిక్‌లకు సంబంధించి దాదాపు 50 స్టాల్స్‌ను ఏర్పాటు చేస్తున్నారు. బుధవారం ఉదయం 9 గంటలకు మొదలయ్యే ఈ కార్యక్రమ ప్రారంభోత్సవానికి మంత్రి ధర్మాన ప్రసాదరావు హాజరుకానున్నట్లు ప్రిన్సిపాల్ చెబుతున్నారు. మధ్యాహ్నం 3.30 గంటల వరకు కార్యక్రమం కొనసాగుతుందని చెప్పారు.

విద్యార్థులను ప్రోత్సహించేందుకు..

డిగ్రీ పూర్తయిన తర్వాత చాలామంది విద్యార్థుల వ్యాపార రంగాన్ని ఎంచుకుంటారని, వాళ్లపై వాళ్లకు ఒక నమ్మకం తీసుకురావడానికి ఇలాంటి స్కిల్ క్వెస్ట్ ఎంతో ప్రోత్సాహాన్ని ఇస్తుందని అధ్యాపకులు చెబుతున్నారు. విద్యార్థులు తమ టాలెంట్‌ను రుజువు చేసుకోటానికి స్కిల్ క్వెస్ట్ ఒక చక్కని వేదికగా నిలుస్తుందని ఆ కళాశాల అధికారులు పేర్కొంటున్నారు.

విజయవంతం చేయాలి

ఈ నెల 21వ తేదీన కళాశాలలో ఏర్పాటు చేస్తున్న స్కిల్ క్వెస్ట్ కార్యక్రమాన్ని విద్యార్థులే నిర్వహిస్తారు. విద్యార్థులను ప్రోత్సహించడానికి ప్రజలు, తల్లిదండ్రులు, ఇతర కళాశాలల విద్యార్థులు పాల్గొనాలి. ప్రభుత్వ డిగ్రీ కళాశాల పురుషులు విద్యార్థులను ప్రోత్సహించాలి.

– డాక్టర్ పి.సురేఖ, శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్

కొనసాగుతున్న డిగ్రీ పేపర్ల మూల్యాంకనం

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం పరిధిలోని అఫిలియేషన్ కళాశాలల డిగ్రీ మూడో సెమిస్టర్ మూల్యాంకనం మరో మూడు రోజుల్లో ముగియనుందని ఎగ్జామినేషన్స్ డీన్ డాక్టర్ ఎస్.ఉదయ్‌భాస్కర్ తెలిపారు. వర్సిటీ పరీక్షల నిర్వహణ కార్యాలయంలో సోమవారం ఆయన వివరాలు వెల్లడించారు. మూల్యాంకనం శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల, శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, నరసన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల, టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల, జీసీఎస్ఆర్ రాజాం ప్రైవేట్ డిగ్రీ కళాశాల, శ్రీకాకుళం రూరల్ పరిధిలోని గాయత్రి డిగ్రీ కళాశాలల్లో కొనసాగుతోందని అన్నారు. త్వరలో ఫలితాల వెల్లడికి ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు.

వర్సిటీ పరిధిలో డిగ్రీ విద్యార్థులు ఇంటర్న్‌షిప్ ఈ నెల 15 నుంచి ప్రారంభం కానుందని, మే 15 వరకు 90 రోజుల పాటు ఈ ఇంటర్న్‌షిప్ కొనసాగుతుందని అన్నారు. 100 మార్కులకు ఇంటర్న్‌షిప్ ఉంటుందని అన్నారు. ఉన్నత విద్యామండలి ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ రెండు పద్ధతుల్లో సైతం ఇంటర్న్‌షిప్‌కు అవకాశం కల్పించిందని అన్నారు. జిల్లాలో ఆఫ్‌లైన్‌లో 5444, ఆన్‌లైన్‌లో 4000 మంది ఇంటర్న్‌షిప్ చేస్తున్నారని తెలిపారు.

వేణుగోపాలునికి క్షీరస్నానం

గార: శాలిహుండం కాళీయ మర్దన వేణుగోపాల స్వామికి సోమవారం రాత్రి 12 గంటల 30 నిమిషాల నుంచి విశేష పూజలు ప్రారంభమయ్యాయి. భీష్మ ఏకాదశి సందర్భంగా శాలిహుండం యాత్ర ఏటా నిర్వహిస్తుంటారు. ముందుగా ఆలయ ట్రస్టీ సుగ్గు మధురెడ్డి దంపతులు పట్టువస్త్రాలు, పూజా సామగ్రిని స్వామికి సమర్పించగా, గోపాలకృష్ణారెడ్డి, మధురవేణి దంపతులు ప్రసాదాలను, పల్లి నర్సింహులు కుటుంబ సభ్యులు పంచామృతాలను సమర్పించారు. అర్చకులు మహేంద్రాడ సాయి శర్మ, వేదపండితులు శాస్త్రోత్తకంగా వివిధ తీర్థ జలాలు, ఓషధులు, పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. గర్భగుడి వద్దనున్న భక్తులు స్వామి విశేష అభిషేకాలు చూసి తరించారు. అనంతరం విశేషంగా క్షీరాభిషేకం నిర్వహించారు.



కాళీయ మర్దన వేణుగోపాలునికి క్షీరాభిషేకం సేవ (ఫైల్)

'రహదారి భద్రత పాటిద్దాం'



రహదారి భద్రత వారోత్సవాలను జెండా ఊపి ప్రారంభిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం రూరల్: రహదారి భద్రతలను ప్రతి ఒక్కరూ పాటిద్దామని శ్రీకాకుళం డీటీసీ ఎ.చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. సోమవారం పెదపాడు రోడ్డులోని రోడ్డు భద్రతా వారోత్సవాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆటో డ్రైవర్లతో స్థానికంగా ప్రతిజ్ఞ చేయించారు. ప్రతి ఒక్కరూ రహదారి భద్రత పాటించాలని, మద్యం సేవించి వాహనాలను నడపవద్దన్నారు. కార్యక్రమంలో మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు పీవీ గంగాధర్‌రావు, ఆర్.గోవిందరావు, ఎఆర్ఎం రాజు పాల్గొన్నారు.